క్లుప్తంగా

మాజీ మంత్రికి జెడ్పీచైర్మన్ 'నూతన' శుభాకాంక్షలు




మాజీ మంత్రి పెద్దిరెడ్డికి, ఎంపీ మిథున్ రెడ్డికి పుష్పగుచ్ఛాలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కలిశారు. పెద్దిరెడ్డి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి సూచించినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



విజయానందరెడ్డిని కలిసి నోట్‌పుస్తకాలు అందజేసిన నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తనను కలవడానికి వచ్చేవారు శాలువలు, బొకేలకు బదులు విద్యాసామగ్రి ఇస్తే పేద విద్యార్థులకు ఉపయోగపడుతుందని ముందుగాగా పిలుపునిచ్చారు. దీంతో పలువురు నాయకులు పేద విద్యార్థులకు అందజేయడానికి నోట్ పుస్తకాలు, పెన్నులను తీసుకొచ్చి ఆయనకు ఇచ్చారు. వీటిని విద్యార్థులకు అందజేయనున్నట్లు వివరించారు.

గుడిపాల నాయకుల శుభాకాంక్షలు

గుడిపాల: విజయానందరెడ్డిని మండలం నుంచి సుమారు వంద మంది వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. విజయానందరెడ్డి సూచన మేరకు పుస్తకాలు, బ్యాగ్‌లు, పెన్నులను తీసుకెళ్లి ఆయనకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ



భజన చేస్తున్న బృందం

గంగాధర నెల్లూరు : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని జీడీ నెల్లూరులో పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో గోవింద నామ స్మరణ భజనలు చేశారు. గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీరామ, గోవింద నామ సంకీర్తనలు ఆలపిస్తూ, గరుడ స్తంభం వెలిగించి, భజనలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించడానికి పూర్వం మార్గశిర మాసంలో విష్ణు నామ జపం చేసేవారని పెద్దలు చెప్పారు. సంక్రాంతి పండుగ రోజు వరకు నిత్యం ఉదయం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని భజన బృందం తెలిపింది.

ఏరువాక ప్రదర్శన




వ్యవసాయ ప్రదర్శనలో నమూనాలను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థినులు, నమూనాల గురించి వివరిస్తున్న ఎస్వీ కళాశాల విద్యార్థులు

మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ రెడ్డిరాము పిలుపునిచ్చారు. ఐరాల మండలంలోని 35 యర్లంపల్లెలో బుధవారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య ప్రారంభించారు. లావణ్య మాట్లాడుతూ రైతులు సాంకేతిక పద్ధతులు, అధిక దిగుబడి ఇచ్చే నూతన విధానాలు అనుసరించాలని తెలిపారు. తద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. వ్యవసాయ ప్రదర్శనలో టెర్రస్ గార్డెన్, బయోగ్యాస్ ప్లాంట్, హైడ్రోపోనిక్స్, డ్రిప్ పద్ధతి, వర్మీ కంపోస్ట్, వివిధ రకాల మల్చింగ్ గురించి విద్యార్థులు వారి ప్రదర్శనల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ సేవా పథకం వారం రోజుల పాటు విజయవంతంగా ముగియడంతో ఈ కార్యక్రమానికి సహకరించిన రైతులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. – ఐరాల




ఆలయాల్లో నూతన సంబరం



బంగారుపాళెం: ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



చిత్తూరు: బీటీ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

- ఆలయాల్లో విశేష పూజలు
- చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు, ప్రార్థనలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం అంబరాన్నంటాయి. మంగళవారం అర్ధరాత్రి 2024కు వీడ్కోలు పలికి 2025కు స్వాగతం పలికారు. కేక్ కటింగ్‌లు, యువత కేరింతలతో కొత్త జోష్ కనిపించింది. ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. వేకువజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. అభిషేకం చేసి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాలు కిక్కిరిశాయి. స్వామి దేవతమూర్తుల దర్శనం కోసం బారులు తీరారు.

అర్ధరాత్రి నుంచి ఆరాధన

నూతన వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని బీటీ చర్చి, టౌన్ చర్చి, జాన్ బాస్కో చర్చి, తెలుగు లూక్ చర్చిల్లో అర్ధరాత్రి ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఉదయం కూడా ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. మత ప్రబోధకులు బైబిల్ వ్యాఖ్యలపై ప్రసంగం చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సేవా కార్యక్రమాలు చేపట్టారు.



బంగారుపాళెం: మొగిలి శివాలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

చీరల పంపిణీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం గిరింపేటలోని చామంతిపురం ప్యూర్ గాస్పల్ చర్చిల్లో మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. పాస్టర్ ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి దుస్తుల పంపిణీని ప్రారంభించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీటర్, పాల్, హరిదాస్, కవిత పాల్గొన్నారు.

అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

గుడిపాల: మండలంలోని పలు అమ్మవారి దేవాలయాల్లో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. జనవరి 1వ తేదీ కావడంతో మండలంలోని ప్రజలు నరహరిపేట వద్ద ఉన్న భద్రకాళమ్మ, బొమ్మసముద్రంలో ఉన్న దుర్గాలమ్మ, నంగమంగళం వద్ద ఉన్న రేణుకాంబ అమ్మవారు, గురుగునత్తంలో గురుగూరమ్మ దేవాలయాల్లో ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయాల్లో నూతన సందడి

బంగారుపాళెం: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో యువకులు సోమవారం రాత్రి నుంచి నూతన సంవత్సర సంబరాలను నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం రాత్రి 12 గంటలకు 2024కు వీడ్కోలు పలికి కొత్త సంవత్సరం 2025కి స్వాగతం పలికి సంబరాలు చేసుకున్నారు.

ఉదయం నుంచే తాకిడి

మండలంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని మొగిలి శివాలయం, బంగారుపాళెం ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురం బోయకొండ, నలగాంపల్లెలోని దేవరకొండపై వెలసిన శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, మొగిలివెంకటగిరిలోని శ్రీ కోదండరామాలయం, గంగమ్మ, ఓంశక్తి ఆలయాల్లో ఉదయం నుంచి భక్తుల తాకిడి మొదలైంది. ఆలయాల వద్ద దాతలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, జయచంద్రరాజు, రుద్రప్ప, మురుగేశన్, విశ్వనాథ్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.





గుడిపాల: భద్రకాళమ్మ గుడిలో భక్తులు, చిత్తూరు: దుర్గమ్మను దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు, ఆలయంలో నిరీక్షిస్తున్న భక్తులు

జర్నలిస్టులకు అండగా ఉంటాం



చిత్తూరు ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే గుర్తింపు పొందిన జర్నలిస్టులకు అండగా ఉంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సరం నూతన డైరీని కలెక్టర్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు చేపట్టే అన్ని పనుల్లో విజయం చేకూరాలని చెప్పారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ ముద్రించిన డైరీ చాలా బాగుందని అభినందించారు. జర్నలిస్టులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డిని కలిసి డైరీలు ఆవిష్కరింపచేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఐ అండ్ పీఆర్ డీడీ పద్మజ, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ బాబు, కాశీశ్వర్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథన్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, పవన్ కుమార్, సభ్యులు అనిల్, రామకృష్ణ, చంద్రప్రకాష్, జయప్రకాష్, జీకే శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన అర్ధగిరి క్షేత్రం



అర్ధగిరి ఆలయంలోని క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం బుధవారం నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం స్వామిని గంధం, సుగంధ పరిమళ పుష్పాలు, తమలపాకులతో అలంకరించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. దీంతో అరగొండ క్షేత్రం రద్దీగా మారింది. క్రమంతో భక్తులు తరలిరావడంతో ఆలయంలో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులు కూలల్లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అయినా నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా అర్ధగిరి హనుమంతుడిని దర్శించుకుంటే విజయాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలోనే అర్ధగిరికి భక్తులు పోటెత్తారు. గంటల తరబడి క్యూలలో నిరీక్షించి స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. అనంతరం ప్రసాదం కోసం కౌంటర్ వద్దకు వెళ్లికు భక్తులకు నిరాశ ఎదురైంది. అక్కడ భక్తులందరికీ సరిపడా ప్రసాదాలు అందుబాటులో లేవు. దీంతో అక్కడ రద్దీ పెరగడంతో తోపులాటకు దారితీసింది. కొందరు భక్తులు నిరీక్షించే ఓపిక లేక వెనుదిరిగారు. ఈ క్రమంలోనే పులిహోర ప్రసాదాల కౌంటర్ దగ్గర స్వల్పంగా తోపులాట చోటుచేసుకుంది. వెంటనే స్పందించిన ఆలయ ఈఓ హనుమంతరావు ప్రసాదాలు అందుబాటులోకి తెచ్చి భక్తులకు అందజేశారు. ఆ తరువాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

సేవా స్ఫూర్తి.. అపూర్వం

- పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన
- రూపురేఖలు మారిన హైస్కూల్ ప్రాంగణం
- పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తున్న పూర్వ విద్యార్థులు



స్వచ్ఛంద సంస్థ సహకారంతో వేసిన బోరు



పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన షెడ్డు

తవణంపల్లె: పూర్వ విద్యార్థులు, దాతల సేవాస్ఫూర్తితో తవణంపల్లె హైస్కూల్ అందంగా రూపుదిద్దుకుంది. మండల కేంద్రంలో 1969లో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి స్థిరపడ్డారు. వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందించాలనే సంకల్పంతో ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థులతోపాటు దాతలు ఆర్థికసాయం అందించడంతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పూర్వ విద్యార్థులు ప్రభుత్వ నిధుల కోసం నిరీక్షించకుండా తమ వంతు ఆర్థిక సాయంతో మౌలిక వసతులు కల్పిస్తూ అభినందనలు అందుకున్నారు.

రూ.4.5 లక్షలతో స్టేజీ ఏర్పాటు

ఉపాధ్యాయినిగా పని చేస్తున్న పూర్వవిద్యార్థి గల్లావాళ్లవూరుకు చెందిన హరిప్రియ రూ.4.5 లక్షలతో హైస్కూల్లో నూతనంగా స్టేజీ ఏర్పాటు చేశారు. హరిప్రియ ఈ హైస్కూల్లో చదివి అక్కడే ఉపాధ్యాయినిగా పని చేసి బదిలీ అయ్యారు. అయినా తనతో చదివిన పూర్వవిద్యార్థులతో కలసి స్టేజీ ఏర్పాటుకు కృషి చేశారు.

రూ.6.5 లక్షలతో షెడ్డు ఏర్పాటు

1989లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు హైస్కూల్ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. కంపలపల్లె పురుషోత్తం నాయుడు తన మిత్ర బృందంతో కలసి రూ.4 లక్షలతో స్టేజీ ముందు విద్యార్థులు ప్రార్థన చేయడానికి వీలుగా షెడ్డు నిర్మించారు. దీంతో విద్యార్థులు వర్షానికి, ఎండకు ఇబ్బంది పడకుండా ప్రార్థన చేయడానికి, పాఠశాల కార్యక్రమాల నిర్వహణకు అనుకూలంగా మారింది. అయితే ఈ షెడ్డు పూర్తవడానికి నిధుల కొరత రావడంతో పూర్వవిద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు రూ.2.5 లక్షలు ఇచ్చి పనులను పూర్తి చేయించారు.

రూ.లక్షతో ఫ్లోరింగ్

ఈ హైస్కూల్లో 1997–98లో పది పూర్తి చేసుకున్న విద్యార్థులు స్టేజీ ముందర ఏర్పాటు చేసిన షెడ్డు కింద విద్యార్థులు కూర్చోవడానికి వీలుగా రూ.లక్ష వ్యయంతో ఫ్లోరింగ్ పనులు చేయించారు.

రూ.9లక్షలతో మరుగుదొడ్లు

మండలంలోని ఐరాల క్రాస్‌లో ఉన్న బాల్మర్ లారీ అండ్ కో లిమిటెడ్ వారి సహకారంతో తవణంపల్లె హైస్కూల్లోని బాలురకు, బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

3.5 లక్షలతో డైనింగ్ హాలు

తవణంపల్లెకు చెందిన దాత గ్రంధి రాజగోపాల్‌శెట్టి, నవనీతమ్మ, డాక్టర్ లక్ష్మీనారాయణ రూ.3.50 లక్షల వ్యయంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడానికి సౌకర్యంగా డైనింగ్ హాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విద్యార్థులు డైనింగ్ హాల్లో భోజనాలు చేస్తున్నారు.

– ఉపాధ్యాయ బృందం ప్రోత్సాహంతో పలువురు దాతలు ముందుకు వచ్చి రూ.2 లక్షలతో హైస్కూల్ ఆవరణలో మట్టి తోలి చదును చేయించారు. దాతలసాయంతో ప్రహరీగోడ ఎత్తు పెంచి పైభాగాన ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా తాగునీటి బోరు వేయించగా పూర్వ విద్యార్థులు బోరు మోటారు అమర్చి పైపులైన్ వేయించి కరెంటు సర్వీసు మంజూరు చేయించి విద్యార్థులకు తాగునీరు సరఫరా చేశారు.



రూ.50 వేలు చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థుల బృందం, ఉపాధ్యాయిని హరిప్రియ



దాతలు ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్



దాతలు నిర్మించిన మరుగుదొడ్లు

అందరికీ కృతజ్ఞతలు

తవణంపల్లె హైస్కూల్ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు చేయూతనిచ్చి స్ఫూర్తిగా నిలిచిన పూర్వ విద్యార్థులకు, దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. వీరి స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాను.

– దేవరాజులు రెడ్డి, హెచ్‌ఎం, తవణంపల్లె హైస్కూల్

మావంతు సాయం చేశాం

మేము చదువుకున్న పాఠశాలకు సదుపాయాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకు వచ్చాం. స్టేజీ దగ్గర ఫ్లోరింగ్ పనులు చేయించారు. దీంతో విద్యార్థులు చదువుకోవడానికి, ప్రార్థన చేయడానికి సౌకర్యంగా ఉంది. పూర్వవిద్యార్థుల సహకారంతోనే పనులు చేయించాం.

–రాజేష్, పూర్వవిద్యార్థి, ఉపాధ్యాయుడు

టెన్నికాయిట్ విజేత దావూద్ జట్టు



టెన్నికాయిట్ పోటీలలో విజేత జట్టు సభ్యులు

బంగారుపాళెం: టెన్నికాయిట్ పోటీల్లో దావూద్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం రాత్రి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు మండల స్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. పోటీలు ఫ్లడ్‌లైట్ వెలుగుల మధ్య నువ్వా నేనా అనేలా రసవత్తరంగా సాగాయి. ఫైనల్ పోటీల్లో బంగారుపాళ్యానికి చెందిన దావూద్ జట్టు ప్రథమ స్థానంలో, సునీర్ అహ్మద్ జట్టు రెండో స్థానం, మూడో స్థానంలో దాము జట్టు నిలిచాయి. విజేతలకు ప్రతమ బహుమతిగా రూ. 3వేలు, ద్వితీయ బహుమతిగా 2 వేలు, మూడో బహుమతిగా వెయ్యి రూపాయలు ప్రదానం చేశారు.